

ఘనంగా దుర్గమాత బోనాలు

దేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా వెల్దండ మండలం కుప్పగండ్ల గ్రామంలో దుర్గమాత బోనాలను ఘనంగా నిర్వహించారు. మాజీ సర్పంచి మట్ట శారదమ్మ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయమే బోనాలను అలంకరించి మహిళలు, యువతులు డప్పు మేళాలతో పురవీధుల్లో శోభాయాత్ర నిర్వహించారు. ఊరేగింపుగా వెళ్లి దుర్గామాత మండపంలో మొక్కులు చెల్లించుకున్నారు.

- న్యూస్‌టుడే, వెల్దండ గ్రామీణం

చెంచులు.. చల్లంగుండాలని..!

ప్రత్యేక వైద్య సదుపాయాలపై ప్రభుత్వం దృష్టి ● మన్ననూరు ఐటీడీఏ పరిధిలో ప్రతిపాదనలు సిద్ధం

ఈనాడు, మహబూబ్‌నగర్ – న్యూస్‌టుడే, అమ్రాబాద్

నల్లమల చెంచుల అభ్యున్నతి, ఆరోగ్యం కోసం ఎన్ని కార్యక్రమాలు ప్రవేశపెట్టినా.. పూర్తి స్థాయిలో అమలవడం లేదు. పోషకాహారం, ఆరోగ్య వసతులు లేక అర్ధాంతర మరణాలతో జనాభా తగ్గుముఖం పడుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వ యంత్రాంగం చిత్తశుద్ధితో దృష్టి సారిస్తేనే చెంచుల జీవన ప్రమాణాలు మెరుగుపడనున్నాయి.

● నాగర్‌కర్నూల్ జిల్లా మన్ననూరు ఐటీడీఏ పరిధిలో ఏడేళ్లలో 620 మంది చెంచులు మృత్యువాత పడ్డారు. వీరిలో 80 శాతం మంది పౌష్టికాహారం, అనారోగ్య సమస్యలతో చనిపోయినవారే ఉన్నారు. చెంచు పెంటల్లో నివసిస్తున్న ఆదివాసీల ఆయు ప్రమాణాలు 50 ఏళ్ల లోపు పడిపోతున్నాయి. పౌష్టికాహార లోపం, రక్తహీనత, సరైన వైద్యం అందక పోవడం వంటి కారణాలతో చిన్న వయసులోనే మరణాలు సంభవిస్తున్నాయి.

● గతంలో నాటి గవర్నర్ తమిళిసై అప్పాపూర్, బౌరాపూర్ చెంచు పెంటలను దత్తత తీసుకుని గర్భిణులకు పౌష్టికాహారంతోపాటు రాజశ్రీ కోళ్లను ప్రతి కుటుంబానికి 10 చొప్పున అందించారు. బైకు అంబులెన్సులు ఇచ్చారు. కొన్నాళ్ల తర్వాత పర్యవేక్షణ లేకపోవడంతో మళ్లీ ఈ రెండు పెంటల్లో సాధారణ పరిస్థితులొచ్చాయి.

● వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా ఇటీవల ఆదివాసీల ఆరోగ్యంపై ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేయగా పలు ప్రతిపాదనలు తెరపైకి వచ్చాయి. ఇవన్నీ క్షేత్రస్థాయిలో అమలైతేనే చెంచుల ఆరోగ్యం బాగు పడుతుంది.



నల్లమలలోని ఓ చెంచు కుటుంబం

నల్లమలలోని ఈర్లపెంటలో మూడు నెలల క్రితం కాన్పు తర్వాత ఓ చెంచు మహిళ మృతి చెందింది. రక్తహీనత, సరైన వైద్యం అందకపోవడం, పోషకాహార లోపంతో ఈ పరిస్థితి నెలకొంది. బాలింత మృతి చెందిన కొన్ని రోజులకే శిశువు కూడా మృత్యువాత పడింది. మన్ననూరు ఐటీడీఏ పరిధిలో 88 చెంచు పెంటలున్నాయి. ప్రస్తుతం 8,400 జనాభా ఉంది. ఏటా ఈ జనాభా తగ్గుతుండటం ఆందోళన కలిస్తోంది. అనారోగ్య సమస్యలతోనే చిన్న వయసులో పలువురు మృతి చెందడమే దీనికి కారణం.



నిర్వహణ లేక వృథాగా ఉన్న బైకు అంబులెన్సు

సమీక్షలో చర్చకొచ్చిన అంశాలివీ..

● అచ్చంపేట, నాగర్‌కర్నూల్ ఆస్పత్రుల్లో చెంచుల కోసం ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేయాలి. అక్కడికి వెళ్లగానే నేరుగా వైద్యం అందించాలి.

● చెంచు పెంటల్లో బైకు అంబులెన్సుల నిర్వహణకు కావాల్సిన సిబ్బంది, ఇంధన ఖర్చు వంటివి సమకూర్చాలి. వన్యమృగాల సంచారం నేపథ్యంలో బైకు అంబులెన్సుల్లో పెంటల్లోకి వెళ్లడానికి భయపడుతున్నారు. ప్రత్యేకంగా అంబులెన్సును ఏర్పాటు చేసి సీటీస్కాన్, ఇతర పరీక్షలు నిర్వహించే సామగ్రిని అందుబాటులో ఉంచాలి.

● చెంచు పెంటల్లో ఔషధాల కోసం ప్రత్యేకంగా స్టోర్, డయాగ్నోస్టిక్ హబ్‌ను ఏర్పాటు చేయాలి. మహిళల్లో రక్తహీనతపై ప్రత్యేక దృష్టి సారించాలి.

● జ్వరాలు వస్తే చికిత్స కోసం వైద్య సిబ్బందే చెంచు పెంటల్లో పర్యటించేలా చర్యలు తీసుకోవాలి.

● ఇక్కడ చాలా కుటుంబాలు సారాకు బానిసయ్యాయి. సంపాదన మొత్తం దీనికే ఖర్చు చేస్తున్నారు. అనారోగ్యంతో చిన్నతనంలోనే మృత్యువాత పడుతున్నారు. అచ్చంపేటలోనే డీ-అడిక్షన్ కేంద్రాలను ఏర్పాటు చేసి వారిలో మార్పు తీసుకురావాలి.

వసతులే లక్ష్యంగా ప్రతిపాదనలు..: నాగర్‌కర్నూల్ డీఎఫ్‌వో, మన్ననూరు ఐటీడీఏ పీవో బాధ్యతలను పర్యవేక్షిస్తున్న రోహిత్ గోపిడి 'ఈనాడు'తో మాట్లాడుతూ 14న చెంచుల ఆరోగ్యానికి కావాల్సిన ప్రతిపాదనలను అందించనున్నామన్నారు. అచ్చంపేట ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ మాట్లాడుతూ మౌలిక సదుపాయాలను మెరుగుపరిచి వైద్య సేవలు అందిస్తామన్నారు.

కాత్యాయనిగా జోగులాంబ

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం జోగులాంబ, కాత్యాయనీ దేవిగా భక్తులకు నేత్రపర్వం చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పూజా కార్యక్రమాలను అర్చకులు నిర్వహించారు. భక్తులు స్వామి వారికి అభిషేకం, స్పర్శ దర్శనం, జోగులాంబకు కుంకుమార్చనలు, అలాగే యాగశాలలో చండీహోమం, సాయంత్రం అమ్మవారి సన్నిధిలో కొలువు పూజ నిర్వహించారు. జోగులాంబ ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రథంలో అమ్మ వారి సన్నిధి నుంచి తీసుకు వచ్చి కొలువు పూజ పూర్తి చేశారు.

-న్యూస్‌టుడే, అలంపూర్





రూ.10 లక్షలతో అలంకరింపబడిన అమ్మవారు

దయచూపు.. ధనలక్ష్మి

దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు పట్టణంలో కన్నుల పండువగా జరుగుతున్నాయి. ఆలయాలతో పాటు భక్త బృందాలు ప్రత్యేక మండపాలు ఏర్పాటు చేసి అమ్మవారిని నెలకొల్పి నిత్య పూజలందిస్తున్నారు. కల్వకుర్తిపట్టణంలోని హనుమాన్‌నగర్‌లో శివశక్తియువసేన రూ. 10,01,116 కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని బాలత్రిపుర సుందరీగా అలంకరించారు. ఈసందర్భంగా బాలలను సత్కరించారు.

- న్యూస్‌టుడే, కల్వకుర్తిపట్టణం



కన్యకా పరమేశ్వరి ఆలయంలో బాలలను సత్కరిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

సీఎం పర్యటనకు ఏర్పాట్లు

వంగూరు, న్యూస్‌టుడే : ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి స్వగ్రామమైన కొండారెడ్డిపల్లికి దసరా పండగకు రానుండటంతో అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. మంగళవారం కలెక్టర్ సంతోష్, ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, ఎమ్మెల్యే వంశీకృష్ణ, సీఎం సోదరుడు ఎనుముల కృష్ణారెడ్డి గ్రామంలో పర్యటించారు. పంచాయతీ భవనం, గ్రంథాలయం, బీసీ సామాజిక భవనం, పశువైద్యశాల, సౌర ప్రాజెక్టు పనులను పర్యవేక్షించారు. సీఎం ఇంటి వద్ద భారీగా బారికేడ్లు ఏర్పాటు, పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. దసరా పండగ రోజు గ్రామంలో విద్యుత్తు సమస్య తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అభివృద్ధి పనులు వెంటనే పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీసభ్యుడు కేవీఎన్‌రెడ్డి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డా. రమేశ్, డీఆర్‌డీవో పీడీ చిన్నఓబులేశ్, విద్యుత్ శాఖ ఎస్ఈ వెంకటేశ్వర్లు, పంచాయతీ రాజ్ శాఖ డీఈ చంద్రకళ, కల్వకుర్తి డీఎస్పీ వెంకటేశ్వర్లు, వెల్దండ సీఐ విష్ణువర్ధన్ రెడ్డి, నాయకులు చిమ్ముల రాజశేఖర్‌రెడ్డి, ఎనుముల వేమారెడ్డి, కృష్ణారెడ్డి, లాలుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.



కొండారెడ్డిపల్లిలో హెలిప్యాడ్‌ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ సంతోష్, ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, ఎమ్మెల్యే వంశీకృష్ణ, సీఎం సోదరుడు కృష్ణారెడ్డి

ఎన్నాళ్లో వేచిన ఉదయం

● ఉమ్మడి జిల్లాలో ఉపాధ్యాయులుగా 1,131 మంది ఎంపిక

● నేడు సీఎం చేతుల మీదుగా నియామక పత్రాలు

అచ్చంపేట, న్యూస్‌టుడే : డీఎస్సీలో అర్హత సాధించిన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన తరువాత 1:1 నిష్పత్తితో తుది జాబితాను జిల్లా విద్యాశాఖాధికారులు ప్రకటించారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో 1,131 మంది ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికయ్యారు. వివరాలను డీఈవోల వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచడంతో పాటు అభ్యర్థులకు వ్యక్తిగతంగా సమాచారం ఇచ్చారు. ఒకటి కన్నా ఎక్కువ ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల నుంచి వారు ఎంపిక చేసుకున్న పోస్టు కోసం డిక్లరేషన్ తీసుకున్నారు. మరో పోస్టులో కూడా ఎంపికైన వారు ఉంటే వారి పేర్లను తొలగించి మెరిట్ జాబితాలో తదుపరి ఉన్న అభ్యర్థులను ఎంపిక చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేయనున్నారు. జిల్లాల వారీగా ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేసి ఎంపికైన వారిని కలెక్టర్ కార్యాలయాల వద్దకు చేరుకోవాలని సమాచారం ఇచ్చారు.

అభ్యర్థుల తరలింపునకు 28 బస్సులు..: ఉపాధ్యాయులుగా ఎంపికైన అభ్యర్థులకు ఆయా జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద బుధవారం ఉదయం ఫొటో గుర్తింపు కార్డులు అందజేస్తారు. హైదరాబాద్‌లోని సీఎం సభకు వెళ్లేందుకు అధికారులు 28 ఆర్టీసీ బస్సులను సిద్ధం చేశారు. ఎంపికైన అభ్యర్థులకు భోజన వసతి ఏర్పాటు చేస్తున్నారు. దసరా సెలవులు పూర్తయ్యేలోగా ఎంపికైన వారికి పాఠశాలలను కేటాయించి సెలవుల తరువాత విధుల్లో చేరేలా చర్యలు తీసుకుంటామని నాగర్‌కర్నూల్ డీఈవో డా. గోవిందరాజులు తెలిపారు.



మహబూబ్‌నగర్ డైట్ కళాశాలలో అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న అధికారులు

జిల్లాల వారీగా వివరాలు..

జిల్లా	ఎంపికైన ఉపాధ్యాయులు	ఆర్టీసీ బస్సులు
మహబూబ్‌నగర్	243	06
నాగర్‌కర్నూల్	285	07
జోగులాంబ గద్వాల	172	04
వనపర్తి	152	04
నారాయణపేట	279	07

ఆలయాల అభివృద్ధికి చర్యలు: కొండా సురేఖ

అలంపూర్, న్యూస్‌టుడే: పవిత్రమైన, ప్రాచీన శిల్ప సంపదకు ఆలవాలమైన అలంపూర్ ఆలయాలను అభివృద్ధి చేస్తామని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా బుధవారం ఇక్కడ జరగనున్న కల్యాణోత్సవానికి మంత్రి మంగళవారం ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పించారు. మంత్రికి ఈవో పురేందర్, ఛైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి, ధర్మకర్త సభ్యులు, అర్చకులు స్వాగతం పలికారు.

గణాంక దర్శన పుస్తకం ఆవిష్కరణ

నాగర్‌కర్నూల్, న్యూస్‌టుడే : జిల్లా ముఖ్య ప్రణాళిక శాఖ తయారు చేసిన జిల్లా గణాంక దర్శన పుస్తకాన్ని కలెక్టర్ బదావత్ సంతోష్ ఆవిష్కరించారు. మంగళవారం కలెక్టరేట్‌లో అధికారులతో నిర్వహించిన ఆవిష్కరణ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించేందుకు, జిల్లా అభివృద్ధికి గణాంకాలు ఆయువుపట్టు అన్నారు. కార్యక్రమంలో సీపీవో భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాతుకుపోయిన రెడ్‌క్రాస్ కమిటీ

సభ్యుల్లో వైద్య శాఖ ఉద్యోగులే అధికం

నాగర్‌కర్నూల్, న్యూస్‌టుడే : జిల్లా రెడ్‌క్రాస్ కమిటీ పాతుకుపోయింది. జిల్లా ఆవిర్భావం నుంచి ఒకే కమిటీ కొనసాగుతోంది. ఆరేళ్లు దాటినా కార్యవర్గంలో మార్పులు లేవు. సభ్యులుగా వ్యాపారులు, విశ్రాంత ఉద్యోగులు, ఇతర వర్గాల వారు అధికంగా ఉంటే రెడ్ క్రాస్ సేవలు విస్తృతంగా పెరిగే అవకాశం ఉంటుంది. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా నాగర్‌కర్నూల్ జిల్లాలో విచిత్రమైన పరిస్థితి ఉంది. జిల్లా ఏర్పడిన కొత్తలో రెడ్ క్రాస్ సొసైటీ ఏర్పాటు చేశారు. అప్పట్లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిగా ఉన్న వ్యక్తి ఛైర్మన్ కావాలనే ఉద్దేశంతో వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులను రెడ్ క్రాస్ సభ్యులుగా నమోదు చేయించారు. దాదాపు తొమ్మిది వందల సభ్యులు ఉంటే అందులో 60 శాతం మంది ఒకే శాఖకు చెందిన వారు ఉన్నారు. అప్పట్లో ఛైర్మన్‌గా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి సుధాకర్‌లాల్‌ను ఎన్నుకున్నారు. తర్వాత అదే శాఖలో పనిచేసే ఉద్యోగిని కార్యదర్శిగా పెట్టుకున్నారు. కమిటీలో వైద్య శాఖ ఉద్యోగులుగా ఉన్నవారికే ఇతర పదవులు ఇచ్చారు. అదే కమిటీ ఆరేళ్లు దాటినా కొనసాగుతోంది. ఉద్యోగులుగా ఉన్నవారు బయట ఏ రకంగా సేవలు అందిస్తారనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.



అసంపూర్తిగా ఉన్న రెడ్‌క్రాస్ సొసైటీ భవనం

ప్రస్తుతం ఛైర్మన్‌గా ఉన్న సుధాకర్‌లాల్ బదిలీపై ఇతర జిల్లాకు వెళ్లారు. ఆయన ఇక్కడికి రావడం లేదు. ఆరేళ్లు దాటిన కమిటీలు దిగిపోవాలని ఇటీవలే రాష్ట్ర గవర్నర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. స్వచ్ఛందంగా దిగిపోవాలని సూచించారు.

కనిపించని సమావేశాలు..

కార్యవర్గ సమావేశాలు ప్రతి మూడు నెలలకోసారి నిర్వహించారు. ఏడాదికి ఒక్క సారి సభ్యులందరితో కలిసి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కాని సమావేశాలు ఎక్కడ నిర్వహించటం లేదు. సమావేశాలు పెట్టి ఏం చేయాలనే దానిపై చర్చలు లేవు. సేవలు ఏ రకంగా విస్తరించాలనే అంశంపై నిర్ణయాలు, తీర్మాణాలు అన్ని మొక్కుబడిగా కొనసాగుతున్నాయి. కొల్లాపూర్ చౌరస్తాలో ప్రభుత్వం రెడ్‌క్రాస్‌కు ఎకరన్నర స్థలం కేటాయించింది. భవన నిర్మాణం కోసం ఎన్ఆర్ఐ రూ. కోటి విరాళం ఇచ్చారు. రూ. 50లక్షలు ఎస్‌బీఐ వారు ఇచ్చారు. వాటితో భవనం నిర్మించారు. అది అసంపూర్తిగా ఉంది. బ్లడ్ బ్యాంక్‌ను ఏర్పాటు చేసేందుకు పరికరాలు వచ్చాయి. బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు అనేది కార్యరూపం దాల్చలేదు. పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. రెడ్‌క్రాస్ కార్యవర్గంను కలెక్టర్ ప్రక్షాళన చేయాలని ప్రజలు కోరుతున్నారు. అన్ని వర్గాల భాగస్వామ్యంతో బలోపేతం చేసి సేవలను విస్తరింప చేయాల్సిన అవసరం ఉంది.

సేవ చేసేందుకు ముందుకు రావాలి

రెడ్ క్రాస్ సేవలను విస్తరించేందుకు అందరు ముందుకు రావాల్సిన అవసరం ఉంది. ఉత్సాహం ఉన్నవారు ముందుకు రాకుండా మౌనంగా ఉంటే సమాజానికి నష్టం జరుగుతోంది. సేవలు అందించేందుకు ఎవరైనా ముందుకు రావొచ్చు. ఏళ్లుగా ఉన్న కమిటీపై పరిశీలిస్తాం. వీటిపై చర్చ జరుగుతోంది. పూర్తి స్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

- శ్రీరాం, రెడ్‌క్రాస్ రాష్ట్ర కార్యదర్శి

హెచ్చరించినా.. నిర్లక్ష్యమే

రెండు నెలల్లో పదవీ విరమణ.. అంతలోనే సస్పెన్షన్



కొల్లాపూర్ ఆర్డీవో నాగరాజు

నాగర్‌కర్నూల్, న్యూస్‌టుడే : విధుల్లో నిర్లక్ష్యం వద్దంటూ కొల్లాపూర్ ఆర్డీవోను పలుమార్లు నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లు అప్రమత్తం చేశారు. హెచ్చరికలను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఆర్డీవో నాగరాజును సస్పెన్షన్ చేస్తూ రెవెన్యూ శాఖ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ధరణి దస్త్రాల విషయంలో నిర్లక్ష్యంగా వ్యహరించటంతో ఓ మాజీ సర్పంచి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఇప్పటికే ధరణి విషయంలో ఆర్డీవో అవినీతి ఆరోపణలను ఎదుర్కొంటున్నారు. ఓఆర్‌సీల జారీ విషయంలో రైతులను ఎక్కువగా ఇబ్బందులకు గురి చేశారన్న ఫిర్యాదులున్నాయి. కార్యాలయంలో ప్రతి చిన్న పనికి డబ్బులు అడుగుతారనే విమర్శలున్నాయి. నాగరాజు మరో రెండు నెలల్లో పదవీ విరమణ చేయనున్నారు. కొల్లాపూర్‌లో ఆయన ఏడాది నుంచి ఆర్డీవోగా కొనసాగుతున్నారు. విధుల్లో అలసత్వం, అవినీతి ఆరోపణలతో ఆర్డీవో సస్పెన్షన్ కావడం జిల్లాలో ఇదే మొదటిసారి. వివిధ ప్రాంతాల నుంచి ధరణి సమస్యలను పరిష్కరించాలని ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణికి అధికంగా ఫిర్యాదులు వస్తున్నా.. కొందరు అధికారుల్లో స్పందన లేదు. ప్రతి వారం 90 దరఖాస్తులు వస్తున్నా.. అధికంగా అపరిష్కృతంగానే ఉంటున్నాయి. ఇటీవలే తహసీల్దార్ల బదిలీలు అయ్యాయి. అంతకు ముందు కొందరు తహసీల్దార్లపై ఇలాంటి ఆరోపణలే వచ్చాయి. దస్త్రాలను పెండింగ్‌లో పెట్టడం.. బేరం కుదిరిన తర్వాతనే పరిష్కరించేవారనే ఆరోపణలున్నాయి. ఆర్డీవో స్థాయి అధికారిపైనే వేటు పడటంతో జిల్లాలోని రెవెన్యూ సిబ్బందిలో గుబులు మొదలైంది.

కలల కొలువు కైవసం

ప్రణాళికాబద్ధంగా, పట్టుదలతో చదివి అనుకున్నది సాధించారు. కలల కొలువు కైవసం చేసుకున్నారు. ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికవడంతో హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి నుంచి నియామక పత్రాలు అందుకోనున్నారు. ఈ సందర్భంగా విజేతల మనోగతమిది..

- న్యూస్‌టుడే, బృందం



చిరకాల కల.. నెరవేరిందిలా: 2012 డీఎస్సీలో 0.4 శాతం మార్కుల తేడాతో ఉద్యోగావకాశాన్ని కోల్పోయాను. 2017లో ఒక మార్కు తేడాతో అవకాశాన్ని పోగొట్టుకున్నా. అచ్చంపేట గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఒప్పంద ఉపాధ్యాయుడిగా చేరాను. ఈసారి ఉద్యోగాన్ని సాధించాలన్న పట్టుదలతో డీఎస్సీకి సిద్ధమయ్యాను. స్కూల్ అసిస్టెంట్ (జీవశాస్త్రం) పరీక్షలో నాగర్‌కర్నూల్ జిల్లాలో రెండో ర్యాంకు సాధించా. కలల ఉద్యోగాన్ని సాధించడం ఎంతో ఆనందంగా ఉంది.

- ఎద్దుల రవి, లక్ష్మీపూర్ (ఉప్పునుంతల)



సంతోషంగా ఉంది: రోజూ 12 గంటలపాటు చదివాను. టీజీ డీఎస్సీ 2024లో సోషల్ స్టడీస్‌లో 75.53 మార్కులతో జిల్లా రెండో ర్యాంకు సాధించి టీచర్ పోస్టుకు ఎంపికయ్యాను. సీఎం చేతుల మీదుగా నియామక పత్రం అందుకోనుండటం మరిచిపోలేను.

- టి రేణుక, గద్వాల



పట్టుదలతో మూడు ఉద్యోగాలు..: అమ్మానాన్నలు వ్యవసాయం చేస్తారు. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలన్న లక్ష్యంతో రెండేళ్ల క్రితం హైదరాబాద్‌కు వెళ్లి శిక్షణ తీసుకున్నా. గురుకుల పీఈటీ ఉద్యోగానికి ఎంపిక కాగా ఈ నెల 6న సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో నియామక పత్రం అందుకున్నా. వసతి గృహ అధికారి ఉద్యోగానికి కూడా అర్హత సాధించాను. ధ్రువపత్రాల పరిశీలన చేయాల్సి ఉంది. తాజాగా డీఎస్సీలో పీఈటీ ఉద్యోగానికి అర్హత సాధించా.

- ముడావత్ శ్రీనివాస్‌నాయక్, పెద్దాయకుంట తండా(జడ్చర్ల)



హిందీ భాష పండితుడిగా..: మాది నిరుపేద గిరిజన కుటుంబం. 15 ఏళ్లుగా ప్రయివేట్ పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాను. ప్రభుత్వ వృత్తి చేపట్టాలన్న పట్టుదలతో నోట్స్ తయారు చేసుకుని చదివాను. ఆన్‌లైన్ తరగతులను ఉపయోగించుకున్నా. బోధనా వృత్తిలో ఉండటంతో కలిసొచ్చింది. రెండో గ్రేడ్ హిందీ భాష పండితుడి ఉద్యోగానికి ఎంపికయ్యాను.

- మూడావత్ రవి, వంకేశ్వరం (పదర)



ఎస్జీటీగా..: మాది పేద వ్యవసాయ కుటుంబం. హైదరాబాద్ నిజాం కళాశాలలో డిగ్రీ, ఖమ్మం ప్రభుత్వ డైట్ కళాశాలలో డీఈడీ పూర్తి చేశాను. 73.33 శాతం స్కోర్‌తో జిల్లా స్థాయిలో 19వ ర్యాంకు సాధించాను. సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడిగా (ఎస్జీటీ) ఎంపికయ్యాను.

- నెల్లికంటి హరీశ్, పదర



మొదటి ర్యాంకు రావటం ఆనందంగా ఉంది..: డీఎస్సీ స్కూల్ అసిస్టెంట్ విభాగంలో 84.37 మార్కులు సాధించి జిల్లా మొదటి ర్యాంకు పొందటం ఆనందంగా ఉంది. పాఠశాలలో పని చేస్తూనే డీఎస్సీకి సిద్ధమయ్యాను.

- గోపాల్, రాజేంద్రనగర్, మహబూబ్‌నగర్



మూడో తరంలో కూడా..: మా తాత ఉపాధ్యాయుడిగా పని చేశారు. తల్లిదండ్రులు ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులే. నేను మూడో తరం ప్రభుత్వ ఉపాధ్యాయిని. చాలా సంతోషంగా ఉంది. డీఎస్సీ ఎస్జీటీ విభాగంలో 77.38 మార్కులు సాధించి 24 ర్యాంకు కైవసం చేసుకున్నాను. అమ్మానాన్నల సహకారంతోనే ఈ విజయం సాధించాను.

- నవ్యశ్రీ, న్యూగంజ్, మహబూబ్‌నగర్



మా కుటుంబంలో తొలి ఉద్యోగం..: అమ్మానాన్నలు వ్యవసాయం చేస్తారు. నాకు ఇద్దరు తమ్ముళ్లు. 11 గంటల పాటు చదివాను. 78.90 మార్కులతో 16వ ర్యాంకు పొందాను. మా కుటుంబంలో తొలి ప్రభుత్వ ఉద్యోగం సాధించాను. తల్లిదండ్రుల ఆకాంక్ష నెరవేర్చాను.

- శ్వేత, చిన్నదార్‌పల్లి(హన్వాడ)



తండ్రి స్ఫూర్తితోనే : నాన్న స్ఫూర్తితో ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని ఉపాధ్యాయ పరీక్షలకు సన్నద్ధమయ్యా. డీఎస్సీలో 70.43 మార్కులతో జిల్లా స్థాయిలో 134 ర్యాంకు వచ్చింది. డీఈవో కార్యాలయం నుంచి ఉద్యోగ అర్హత సందేశం రావడంతో చాలా సంతోషంగా ఉంది.

- అనిత, భూత్పూర్



ఉపాధ్యాయుడిగా స్థిరపడాలనే...: 2017 డీఎస్సీలో అర మార్కుతో ఉద్యోగం కోల్పోయా. అప్పటి నుంచి పట్టుదలతో సిద్ధమయ్యా. 84 మార్కులతో ఎస్జీటీ తెలుగు మాధ్యమంలో జిల్లా మొదటి ర్యాంకు సాధించా.

- తుప్పలి శివసాయి, మహబూబ్‌నగర్



కుటుంబ సభ్యుల ప్రోత్సాహం

భూత్పూర్ : కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యా. మాది షాద్‌నగర్, ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో చదివాను. పోటీ పరీక్షల్లో 66.70 మార్కులతో ఉపాధ్యాయురాలిగా అవకాశం దక్కింది.

- తేజస్విని, అమిస్తాపూర్



లక్ష్యం నెరవేరింది : అమ్మానాన్న చిన్ననాటి నుంచే కూలీ పనులు చేస్తూ నన్ను చదివించారు. ఉపాధ్యాయ వృత్తిలో స్థిరపడాలనే లక్ష్యంతో విద్యాభ్యాసం సాగించా. కొన్ని రోజులు ప్రైవేటు పాఠశాలలో విద్యాబోధన చేస్తూ, సొంతంగా పరీక్షలకు సిద్ధమయ్యా. 77.07 మార్కులతో పాలమూరు జిల్లా కేటగిరిలో 26వ ర్యాంకు సాధించా.

- దోకూరు అనిత, అమిస్తాపూర్




అవమానాలు ఎదుర్కొన్నా.. గత డీఎస్సీలో కొద్ది తేడాతో ఎస్జీటీ అవకాశాన్ని కోల్పోయాను. ఎలాగైనా ఉద్యోగం సాధించాలన్న పట్టుదలతో చదివాను. ఈ డీఎస్సీలో 70.8 శాతం మార్కులతో 49వ ర్యాంకు సాధించా. స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ రెండు ఉద్యోగాలకు ఎంపికయ్యాను. ఎస్ఏ (జీవశాస్త్రం) ఉద్యోగాన్ని ఎంపిక చేసుకున్నా.

- చింతల కార్తీక్, అచ్చంపేట



అమ్మ కష్టాన్ని చూసి ఉద్యోగం సాధించా..: నాన్న మృతిచెందడంతో అమ్మ శకుంతలమ్మ కూలీ పనులు చేస్తూ చదివించారు. అమ్మ కష్టాన్ని చూసి ఎలాగైనా ప్రభుత్వం ఉద్యోగం సాధించాలన్న లక్ష్యంతో చదివాను. ఎస్జీటీగా ఎంపికయ్యాను.

- శ్రీకాంత్, పెద్దమారూర్, చిన్నంబావి మండలం



రోజూ ఏడు గంటలు చదివాను...: డీఎస్సీలో ఆంగ్లంలో నాకు జిల్లా మొదటి ర్యాంకు వచ్చింది. 6 నుంచి పదో తరగతి వరకు పాఠ్య పుస్తకాలను రోజు ఏడు గంటలు చదివాను. ఆంగ్ల ఉపాధ్యాయుడిగా నియామకం సంతోషంగా ఉంది.

- అక్షయ్‌కుమార్, వనపర్తి



నాన్న, అక్కల స్ఫూర్తితో.. : నాన్న, అక్కలా నేను కూడా ఉపాధ్యాయురాలిని కావాలనే కోరిక నెరవేర్చుకున్నాను. డీఎస్సీలో 77.45 మార్కులతో ఓపెన్‌లోనే స్థానిక సంస్థల విభాగంలో స్కూల్ అసిస్టెంట్ గణితంలో మొదటి ర్యాంకు సాధించాను.

- బి.సుమన, మహబూబ్‌నగర్











వనపర్తి వల్లభ్‌నగర్‌లో ధనలక్ష్మి అవతారంలో.. దేవరకద్రలో వాసవీమాత అలంకరణ.. మహబూబ్‌నగర్: వాసవీ మాత ఆలయంలో.. అచ్చంపేట: వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో అమ్మవారి అలంకరణ..

అయిజ: కాళికాదేవి ఆలయంలో మహాలక్ష్మీదేవి అలంకరణ

తంగేడు పూల సోయగం.. బతుకమ్మ సంబరం

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పండుగ వాతావరణం నెలకొంది. మండపాల్లో కుంకుమార్చనలు, వాడ వాడలో బతుకమ్మ సంబరాలు కొనసాగుతున్నాయి. మంగళవారం మహిళలు, యువతులు, చిన్నారులు బతుకమ్మ పాటలు పాడుతూ సందడి చేశారు. ఉత్సాహంగా కోలాటాలు, దాండియా ఆడారు.

- న్యూస్‌టుడే బృందం



మహబూబ్‌నగర్: తలపై బతుకమ్మతో..



నాగర్‌కర్నూల్ : పట్టణంలోని రాఘవేంద్రకాలనీలో అమ్మవారికి వివిధ రకాల నైవేద్యాలు సమర్పించిన మహిళలు



మహబూబ్‌నగర్: బతుకమ్మను ఎత్తుకున్న కలెక్టర్ విజయేందిర బోయి



మహబూబ్‌నగర్ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు, యువతులు, చిన్నారులు



కొల్లాపూర్ : కోర్టు ఆవరణలో బతకమ్మకు పూజలు చేస్తున్న జడ్జీలు ఆర్‌వీఎస్ఎస్ మిథున్ తేజ, జోత్స్న



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలి

కందనూలు, న్యూస్‌టుడే : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలని రాష్ట్ర విద్యా పరిరక్షణ కమిటీ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీనారాయణ కోరారు. నాగర్‌కర్నూల్ పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో మంగళవారం ఆ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం జీవో సంఖ్య 25 జారీ చేసి ప్రభుత్వ పాఠశాలలు ఎత్తివేయడానికి ప్రయత్నాలు చేయడం సరైన విధానం కాదన్నారు. ప్రతి తండాలో పాఠశాలలు ఉండాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రచారం నిర్వహిస్తున్నా.. క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదని విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి ప్రభుత్వం కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామస్వామి, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, ఉపాధ్యాయులు శోభన్‌బాబు, కిరణ్, రామస్వామి, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

బ్రెజిల్ ఫెలోషిప్‌కు పాలమూరువాసి



డా.జయపాల్

పాలమూరు, న్యూస్‌టుడే : బ్రెజిల్ దేశ ప్రతిష్ఠాత్మక 'అవుట్‌స్టాండింగ్ సైంటిస్ట్ ప్రోగ్రామ్' ఫెలోషిప్‌కు మహబూబ్‌నగర్ పట్టణం ఏనుగొండలోని సంతోష్‌నగర్‌కు చెందిన డా. జయపాల్ ఎంపికయ్యారు. గర్భాశయ ముఖద్వార, రొమ్ము క్యాన్సర్‌కు మందులు కొనుక్కోవడానికి ప్రపంచవ్యాప్తంగా 20 మంది శాస్త్రవేత్తలను ఎంపిక చేయగా ఆసియా నుంచి డా. జయపాల్ ఒక్కరే చోటు సంపాదించారు. ఈ బృందానికి ఆయనే నాయకత్వం వహించనున్నారు. తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో పీజీ, పీహెచ్‌డీ(ఆర్గానిక్ కెమిస్ట్రీ) చేసిన డా. జయపాల్ చైనాలో శాస్త్రవేత్తగా పనిచేశారు. కరోనా కాలంలో భారత్‌కు వచ్చి హైదరాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీలో పనిచేశారు. ప్రస్తుతం సీఎంఆర్ టెక్నికల్ క్యాంపస్‌లో ఆచార్యుడిగా కొనసాగుతున్నారు. 'అవుట్‌స్టాండింగ్ సైంటిస్ట్ ప్రోగ్రామ్'కు దరఖాస్తు చేయగా మూడు విడతలుగా అంతర్జాలం ద్వారా మౌఖిక పరీక్షలు నిర్వహించి ఎంపిక చేశారు. ప్రతిష్ఠాత్మక ఫెలోషిప్‌కు ఎంపికవటం, చాలా దేశాల నుంచి వచ్చే శాస్త్రవేత్తలకు తాను ప్రధాన శాస్త్రవేత్తగా నాయకత్వం వహించనుండటం ఆనందంగా ఉందని డా. జయపాల్ 'న్యూస్‌టుడే'తో పేర్కొన్నారు.

తనిఖీ చేయకున్నా నియామకమా..?

పేట డీఈవో కార్యాలయం ఎదుట అభ్యర్థుల ఆందోళన





డీఎస్సీ అభ్యర్థుల నిరసనకు మద్దతు తెలుపుతున్న పీఆర్టీయూ టీఎస్, తపస్ జిల్లా అధ్యక్షులు.. డీఈవో కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టిన అభ్యర్థులు, ఉపాధ్యాయ సంఘాలు

నారాయణపేట పట్టణం, న్యూస్‌టుడే : డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలనలో అవకతవకలు జరిగాయని, ధ్రువపత్రాల తనిఖీ చేయని వ్యక్తికి ఎలా ఉద్యోగం ఇస్తారని పలువురు అభ్యర్థులు ప్రశ్నించారు. నారాయణపేట జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట మంగళవారం సాయంత్రం ఆందోళన చేపట్టారు. పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు జనార్దన్ రెడ్డి, నాయకులు సత్యనారాయణ రెడ్డి, తపస్ జిల్లా అధ్యక్షుడు శేర్ కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి నరసింహా వీరికి మద్దతు తెలిపారు. జాబితా సవరించి అర్హత కలిగిన అభ్యర్థులకు న్యాయం చేయాలని, డీఈవోను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నో ఏళ్లుగా కష్టపడి చదివిన అభ్యర్థులకు అధికారి తీరుతో తీవ్ర నష్టం జరిగిందన్నారు. భాష పండిత్ (హిందీ)లో ఐదో ర్యాంకు వచ్చిన తనను కాకుండా అర్హత లేని, ధ్రువపత్రాల పరిశీలన చేయని అభ్యర్థిని ఎంపిక చేయడం సరికాదని భారతి అనే మహిళ అవేదన వ్యక్తం చేశారు. జుట్ల కవిత, తిమ్మప్ప అనే అభ్యర్థులు స్కూల్ అసిస్టెంట్ సోషల్, తెలుగుల్లో ర్యాంకులు సాధించారు. తాము సోషల్ కోరుకుంటే తెలుగు ఎలా కేటాయిస్తారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. అభ్యర్థులు, ఉపాధ్యాయ సంఘాల నేతలు డీఈవో కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టడంతో స్థానిక సీఐ శివశంకర్, పోలీసు అధికారులు అక్కడికి చేరుకున్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని డీఈవో అబ్దుల్ ఘని చెప్పినా ఆందోళనకారులు తగ్గలేదు. డీఈవో కార్యాలయం ఎదుట రాత్రి వరకు బైఠాయించారు. రాత్రి 9 గంటల వరకు అభ్యర్థులు ఒక్కొక్కరూ జమ అవుతుండటంతో ఆ ప్రాంతంలో ఉద్రిక్తత నెలకొంది.

అభ్యర్థులకు అన్యాయం జరిగింది : పీఆర్టీయూ

ధ్రువపత్రాల పరిశీలనలో అవకతవకలతో డీఎస్సీ అభ్యర్థులకు అన్యాయం జరిగిందని పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు జనార్దన్ రెడ్డి,నాయకులు ఎమ్మెల్యే పర్ణిక రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. డీఈవో తీరుతో ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని వివరించారు. ఆయనను వెంటనే సస్పెండ్ చేయాలని కోరారు.

తపాలా శాఖ నిర్లక్ష్యంతో చేజారిన ఉద్యోగం

గత 27న మౌఖిక పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 4న చేరిన లేఖ



తపాలా కార్యాలయం వద్ద ఆలస్యంగా వచ్చిన లేఖ చూపుతున్న యువకుడు నాగరాజు

జడ్చర్ల, న్యూస్‌టుడే : యువకుడికి సకాలంలో లేఖ అందకపోవడంతో ప్రభుత్వ ఉద్యోగ అవకాశం చేజారిన ఘటన జడ్చర్లలో మంగళవారం వెలుగు చూసింది. బాధితులు, తపాలా శాఖ అధికారుల కథనం ప్రకారం.. జడ్చర్ల మండలం గంగాపూర్‌కు చెందిన బి.నాగరాజు బీఎస్సీ చదివారు. 12 ఏళ్ల క్రితం తండ్రి చనిపోగా తల్లి, చెల్లి ఉన్నారు. ఏ జీవనాధారం లేదు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం సిద్ధమవుతూనే కుటుంబ పోషణ కోసం స్థానిక పోలేపల్లిలోని ప్రైవేటు పరిశ్రమలో పనిచేస్తున్నారు. 2023లో నాగరాజు తెలంగాణ ఎలక్ట్రిసిటి రెగ్యులేటరీ కమిషన్‌లో ఉద్యోగానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. ఈ ఏడాది మార్చిలో పరిశీలన కోసం తన విద్యార్హత ధ్రువపత్రాలను పంపించారు. నాగరాజుకు మెరిట్ మార్కులు, జోనల్‌లో ఎస్సీ కోటాలో ఒకే ఉద్యోగం ఉండటంతో మౌఖిక పరీక్షకు అర్హత సాధించారు. సెప్టెంబర్ 27న మధ్యాహ్నం 2 గంటలకు ఒరిజినల్ ధ్రువపత్రాలతో హైదరాబాద్‌లోని కార్యాలయంలో నిర్వహించే మౌఖిక పరీక్షకు హాజరు కావాలని కమిషన్ అధికారులు సెప్టెంబరు 4న అభ్యర్థికి స్పీడ్ పోస్టు ద్వారా లేఖ పంపారు. సకాలంలో హాజరుకాకపోయినా, ధ్రువపత్రాలు సరిగ్గాలేకపోయినా ఉద్యోగానికి అర్హత ఉండదని లేఖలో పేర్కొన్నారు. తపాలా శాఖ ద్వారా పంపిన లేఖ గడువు ముగిసిన తర్వాత ఈ నెల 4న అభ్యర్థి నాగరాజుకు అందింది. అతడు అధికారులను సంప్రదించగా మౌఖిక పరీక్షకు హాజరుకాకపోవడంతో మరొకరికి ఉద్యోగం ఇచ్చినట్లు తెలిపారు. ఉద్యోగం చేజారిపోవడంతో బాధితుడు మంగళవారం జడ్చర్లలోని తపాలా శాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రవికుమార్‌కు బంధువులు, స్నేహితులతో కలిసి వెళ్లి ప్రశ్నించారు. దీనిపై అసిస్టెంట్ సూపరింటెండెంట్ మాట్లాడుతూ గంగాపూర్ గ్రామంలో లేఖలు పంపిణీ చేసే శ్రీకర్ గత నెల 24న ఉద్యోగానికి రాజీనామా చేయటంతో మరో వ్యక్తి సర్దార్‌కు ఆ బాధ్యత అప్పగించామని పేర్కొన్నారు. గత నెల 18న అందించినట్లు తమ సిబ్బంది చెబుతున్నా అందులో నిజం లేదని, ఈ నెల 4వ తేదీనే అందినట్లు తెలుస్తోందని పేర్కొన్నారు. సకాలంలో లేఖ అందించకపోవడానికి కారణాలు తెలుసుకొని చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఉద్యోగం చేజారడంతో బాధితుడు, కుటుంబ సభ్యులు తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది.



క్రిష్ణవేణి

మాట వినడంలేదని మట్టుబెట్టాడు

భార్యను సుత్తితో బాది చంపిన భర్త

నార్సింగి, న్యూస్‌టుడే: భార్య తనను నిర్లక్ష్యం చేస్తోందని, తన మాట వినడం లేదని కోపం పెంచుకున్న భర్త నిద్రిస్తున్న ఆమెను సుత్తితో కొట్టి దారుణంగా హత్య చేసిన ఉదంతం హైదరాబాద్‌లోని హైదర్షాకోట్ మాధవీనగర్‌లో వెలుగు చూసింది. నార్సింగి ఇన్‌స్పెక్టర్ హరిక్రిష్ణారెడ్డి కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్రకు చెందిన శ్రీనివాస సాగర్, క్రిష్ణవేణి(32) దంపతులు జీవనోపాధి కోసం వలసవచ్చి హైదర్షాకోట్‌లో నివాసం ఉంటున్నారు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరిగేవి. తనను నిర్లక్ష్యం చేస్తోందని, చెప్పిన మాట వినటం లేదని భార్యపై శ్రీనివాస సాగర్ ద్వేషం పెంచుకున్నాడు. ఈ క్రమంలోనే మంగళవారం తెల్లవారుజామున నిద్రిస్తున్న భార్య తలపై సుత్తితో బాదడంతో ప్రాణాలు కోల్పోయింది. అనంతరం నిందితుడు ఇద్దరు పిల్లలతో పోలీసుస్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించి మృతదేహాన్ని మార్చురీకి తరలించారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	114-00
రిటైల్	136-00
డ్రెస్డ్	197-00
స్కిన్‌లెస్	224-00

ఆర్మీజవాన్‌పై కత్తితో దాడి

ధరూర్, న్యూస్‌టుడే: మండల పరిధిలోని రేవులపల్లి గ్రామంలో ఆర్మీజవాన్‌పై కత్తితో దాడి చేసిన ఘటన చోటు చేసుకుంది. ఎస్సై అబ్దుల్ షుకూర్ కథనం మేరకు. . రేవులపల్లిలో సోమవారం రాత్రి బతుకమ్మ సంబరాలు డీజే సౌండ్ సిస్టమ్‌తో బతుకమ్మలను ఊరేగింపుగా తీసుకెళ్తున్నారు. ఈ సందర్భంగా గ్రామ కూడలిలో డీజే సౌండ్ తక్కువగా పెట్టాలని కృష్ణవర్ధన్‌రెడ్డి అనే వ్యక్తి అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో బతుకమ్మ ఊరేగింపు నిర్వాహకులకు కృష్ణవర్ధన్ మధ్య ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో ఆర్మీజవాన్ మణివర్ధన్ తమ్ముడిపై కృష్ణవర్ధన్ దాడి చేశారు. విషయం తెలుసుకున్న మణివర్ధన్ బతుకమ్మ సంబరాల వద్దకు వచ్చి వారించటానికి ప్రయత్నించాడు. కోపోద్రిక్తుడైన కృష్ణవర్ధన్ సమీపంలో ఉన్న తన ఇంట్లోకి వెళ్లి కత్తి తీసుకొచ్చి మణివర్ధన్‌పై దాడి చేశాడు. మణివర్ధన్‌కు తీవ్ర గాయాలు కావటంతో గద్వాల ప్రభుత్వాస్పత్రికి, అనంతరం మెరుగైన చికిత్సకు హైదారాబాద్ తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

ఇనుప కడ్డీ గుచ్చుకుని ఒకరి మృత్యువాత

ఇటిక్యాల, న్యూస్‌టుడే: ఇనుప గ్రిల్ కడ్డీ గొంతుకు కుచ్చుకుని వ్యక్తి మృతి చెందిన ఘటన ఎర్రవల్లిచౌరస్తాలో చోటు చేసుకుంది. ఇటిక్యాల ఎస్ఐ వెంకటేశ్ కథనం ప్రకారం.. గద్వాల మండలం బసాపురం గ్రామానికి చెందిన కె.క్రిష్టారెడ్డి(68) ఉద్యోగ విరమణ అనంతరం కొత్తకోటలో కుటుంబ సభ్యులతో కలిసి ఉంటున్నాడు. మంగళవారం ఎర్రవల్లిలో బంధువుల వద్దకు వచ్చాడు. జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేసిన ఇనుప గ్రిల్ వద్ద మూత్రవిసర్జన చేసేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు గ్రిల్‌పై పడ్డాడు. గొంతు నుంచి కడ్డీ తల భాగంలోకి చొచ్చుకుపోగా అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

రైలుకింద పడి ఆత్మహత్య

మహబూబ్‌నగర్ పట్టణం : రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మహబూబ్‌నగర్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. రైల్వే ఎస్సై సయ్యద్ అక్బర్ కథనం ప్రకారం.. అప్పన్నపల్లికి చెందిన పెంటయ్య గౌడ్(38)కు వెనుకా ముందు ఎవరూ లేకపోవటం, కటిక పేదరికంతో జీవితంపై విరక్తి చెంది అప్పన్నపల్లి వంతెన సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కందనూలు, న్యూస్‌టుడే

? నాగర్‌కర్నూల్ పట్టణంలోని శ్రీనగర్‌కాలనీలో పలు చోట్ల వీధి దీపాలు పట్టపగలే వెలుగుతున్నాయి. విద్యుత్తు వృథా అవుతోంది.
- నరేందర్, నాగర్‌కర్నూల్

✔ ఆన్ ఆఫ్ స్విచ్చులు ఏర్పాటు చేసి విద్యుత్తు వృథా అరికడతాం.

? నాగర్‌కర్నూల్‌లోని మిషన్ కాంపౌండ్ సమీపంలో నల్లవెల్లి రోడ్డు ప్రధాన రహదారి పక్కన కొందరు చెత్త వేస్తున్నారు. తీవ్ర దుర్వాసన వస్తోంది. **- బాబు, నాగర్‌కర్నూల్**

✔ చెత్తను తొలగిస్తాం. రోడ్డు పక్కన చెత్త వేయకుండా స్థానికులకు అవగాహన కల్పిస్తాం.

- పై రెండు సమస్యలకు నాగర్‌కర్నూల్ పుర కమిషనర్ నరేశ్‌బాబు సమాధానాలిచ్చారు.

పాటు కాల్వల్లో మురుగు

కోడేరు, కొల్లాపూర్ గ్రామీణం, న్యూస్‌టుడే : గ్రామాల్లో ఉన్న పాటు కాల్వలు పూడిక, మురుగుతో కలుషితమవుతున్నాయి. పొలాలకు చెరువులు, కుంటల ద్వారా నీరు అందించేందుకు పాటు కాల్వ, పంట కాల్వలను గతంలో ఏర్పాటు చేశారు. ఏళ్ల తరబడి మరమ్మతులు, సీసీ లైనింగ్, రాతి నిర్మాణం చేయకపోవడంతో చాలా చోట్ల ధ్వంసమయ్యాయి. మరికొన్ని చోట్ల కంపచెట్లు, జమ్ముగడ్డి పెరిగిపోయింది. కొల్లాపూర్ నియోజకవర్గం వ్యాప్తంగా ఈ సమస్య ఉంది.



కోడేరులో రెడ్డికుంట పంట కాల్వలో మురుగు

ఇళ్ల మధ్యలో.. : చెరువులు, కుంటల పాటు కాల్వలు గ్రామాల మధ్యలో నుంచి ఉండడంతో మురుగు కలుస్తోంది. ఫలితంగా దోమలు వ్యాప్తి చెంది రోగాలు వస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. మురుగు నీటితో పంటల సాగు సైతం ఇబ్బందిగా ఉందని రైతులు చెబుతున్నారు. సమస్యలపై పలుసార్లు అధికారులకు వివరించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రత్యేక చొరవ తీసుకొని, పరిష్కరించాలని కోరుతున్నారు.

ఈ ప్రాంతాల్లో సమస్య..

- కోడేరు మండల కేంద్రంలోని ఊరకుంట, రెడ్డికుంట, జనుంపల్లి, కొండ్రావుపల్లి పెద్దచెరువు, ముత్తిరెడ్డిపల్లి, తుర్కదిన్నె, తుర్కదిన్నె జలాశయం పాటు కాల్వలు గ్రామాల మధ్యలో ఉన్నాయి. ఇందులో మురుగు కలుస్తోంది. కోడేరులోని బాపనికుంట, కొత్తకుంటలో సాగు నీరు కలుషితమవుతున్నాయి.
- పెద్దకొత్తపల్లి మండలం కల్వకోల్, నక్కలపల్లి, చిన్నకొత్తపల్లి, గంట్రావుపల్లి తదితర గ్రామాల్లో భారీ వర్షాలు వచ్చిన సమయంలో కాల్వల్లో ఉన్న నీరు ఇళ్ల వరకు చేరుతోంది.

ఏళ్లుగా మరమ్మతులు కరవైన వైనం

- కొల్లాపూర్ పట్టణంలోని వరిదేల జమ్ముచెట్టు నుంచి వసతి గృహం వరకు పాటు కాల్వలో మురుగు నీరు చేరుతోంది. పట్టణంలోని పాత బస్టాండు నుంచి అంబేడ్కర్ కాలనీ - చుక్కాయిపల్లి చెరువుకు ఉన్న పాటు కాల్వ పరిస్థితీ ఇదే.
- పెంట్లవెల్లి మండల కేంద్రంలోని చౌటచెరువు, బాపనికుంట, కొండూరులోని ఊరచెరువు పాటు కాల్వలు గ్రామాలకు ఆనుకొని ఉన్నాయి.

ప్రతిపాదనలు పంపిస్తాం..

గ్రామాల మధ్యలో నుంచి వెళ్లే పాటు కాల్వ, పంట కాల్వలకు రాతి నిర్మాణంతో పాటు సీసీ లైనింగ్ కోసం ప్రతిపాదనలు పంపుతాం. పంట కాల్వలకు మురుగు నీరు వదలకుండా పంచాయతీ వారు చర్యలు తీసుకోవాలి.
- రవీందర్, నీటిపాదల శాఖ ఈఈ, నాగర్‌కర్నూల్

పంట కాల్వలకు మురుగు నీరు వదులకుండా అవగాహన కల్పిస్తాం. ఆయా గ్రామ పంచాయతీ వారు తీర్మానం చేసి కాల్వలో ఉన్న చెట్లు తొలగింపునకు సాధారణ నిధులు వాడుకోవచ్చు. గ్రామాల్లో పర్యటించి చర్యలు చేపడుతాం.
- శ్రీరాములు, డీఎల్‌పీవో, కొల్లాపూర్

వ్యవసాయానికి కాంగ్రెస్ పెద్దపీట

బల్మూర్ (అచ్చంపేట న్యూటౌన్), న్యూస్‌టుడే : కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. మంగళవారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌లో 13 దుకాణాలు, 500 మెట్రిక్ టన్నుల గోదాం, బల్మూర్ మండల కేంద్రం, కొండనాగుల, తుమ్మన్‌పేటలో గోదాములను ప్రారంభించి మాట్లాడారు. ఈనెల చివరి వరకు సీఎం చేతుల మీదుగా అచ్చంపేట ఎత్తిపోతల పథకం పనులను ప్రారంభించేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ఇటీవల వర్షాలకు ధ్వంసమైన కేఎల్ఐ కాల్వలకు మరమ్మతులు చేస్తామన్నారు. తుమ్మన్‌పేట గేటు నుంచి గ్రామం వరకు మిషన్ భగీరథ పైప్‌లైన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం పట్టణంలోని ఆర్టీసీ డిపోలో నర్సాయపల్లికి బస్సు ప్రారంభించి, గ్రామం వరకు అందులో ప్రయాణించారు. డీసీసీబీ ఛైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, డీసీవో రఘునాథ్‌రావు, మార్కెట్ అధ్యక్షురాలు రజిత, పీఏసీఎస్ ఛైర్మన్ నర్సయ్యయాదవ్, సీఈవో రాజవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

పీఆర్టీయూ రాష్ట్ర కార్యవర్గంలో చోటు

పెద్దకొత్తపల్లి, న్యూస్‌టుడే : పీఆర్టీయూ రాష్ట్ర కార్యవర్గంలో పెద్దకొత్తపల్లి మండలానికి చెందిన పలువురికి చోటు దక్కినట్లు పీఆర్టీయూ మండలాధ్యక్షుడు కోట్ల బాబూరావు తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లో ఎన్నికలు నిర్వహించగా పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా రాజయ్య (దేవునితిర్మలాపూర్, జీహెచ్‌ఎం), ప్రవీణ్‌రెడ్డి (చంద్రకల్, హెచ్‌ఎం), పరమేశ్వర్ (నారాయణపల్లి, ఉపాధ్యాయుడు), ఉపాధ్యక్షులుగా శివుడు (పెద్దకొత్తపల్లి), ఉదయభాస్కర్ (వెన్నచర్ల), సాయిప్రకాశ్‌రెడ్డి (పెద్దకార్పాముల) ఎన్నికైనట్లు చెప్పారు.

కొల్లాపూర్ ఉపాధ్యాయులకు..

కొల్లాపూర్ పట్టణం, న్యూస్‌టుడే: పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా రంగినేని కృష్ణ, అల్వాల అర్జున్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా గోవిందుగౌడ్‌ను ఎన్నుకున్నారు.

ముగిసిన వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

అచ్చంపేట, న్యూస్‌టుడే : పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవి ఆలయ సముదాయంలో ఈనెల 4 నుంచి నిర్వహిస్తున్న శ్రీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం ముగిశాయి. వసంతోత్సవం, చక్రస్నానం, సహస్ర దీపాలంకార సేవ, ఊంజల్ సేవ పూజలు నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు మహిళలు కుంకుమార్చన పూజలు చేశారు.



కోనేరులో చక్రస్నానం పూజల్లో పాల్గొన్న భక్తులు

కోర్టు ఆవరణలో బతుకమ్మ వేడుకలు

కొల్లాపూర్ పట్టణం, న్యూస్‌టుడే : కొల్లాపూర్ కోర్టులో మంగళవారం బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. వివిధ పూలతో బతుకమ్మను తయారు చేసి న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పూజలు చేశారు. అనంతరం సంప్రదాయంగా పాటలు పాడుతూ.. బతుకమ్మ ఆడారు. న్యాయమూర్తులు ఆర్‌వీఎస్ఎస్ మిథున్‌తేజ, జోత్స్న బతుకమ్మ ప్రాధాన్యతను వివరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కర్నె శ్రీహరి, న్యాయవాదులు రామలక్ష్మమ్మ, నళిని, రేణుక, నిరంజన్, ఎండీ నజిరుద్దీన్, బాలస్వామి కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కజొన్న క్వింటా గరిష్ఠ ధర రూ.2,385


అచ్చంపేట, న్యూస్‌టుడే : అచ్చంపేట వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం మొక్కజొన్న, ఆముదాల క్రయవిక్రయాలు నిర్వహించారు. 22 మంది రైతులు 368 క్వింటాళ్ల (736 బస్తాలు) మొక్కజొన్న ధాన్యం మార్కెట్‌కు తెచ్చారు. క్వింటా గరిష్ఠ ధర రూ.2,385, మాదిరి ధర రూ.2,295, కనిష్ఠ ధర రూ.1,750 చొప్పున పలికింది. ఆముదాలు క్వింటా గరిష్ఠ ధర రూ.5,550, కనిష్ఠ ధర రూ.5,250 చొప్పున రైతుల నుంచి వ్యాపారులు కొనుగోలు చేశారు.



అచ్చంపేట: మారుతినగర్ కాలనీలో మహాలక్ష్మీగా అమ్మవారు



కొల్లాపూర్: కన్యకా పరమేశ్వరీ ఆలయంలో పుష్పలంకరణలో..



అమ్రాబాద్: అమరేశ్వరాలయంలో...



తిమ్మాజిపేటలో..



అచ్చంపేట: అయ్యప్ప ఆలయ ఆవరణలో బాలికల కూచిపూడి నృత్యం

ఆరో రోజు ఘనంగా పూజలు



అచ్చంపేట: ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో ఎమ్మెల్యే వంశీకృష్ణ దంపతులు

జిల్లాలో శరన్నవరాత్రి ఉత్సవాలు మంగళవారం ఘనంగా కొనసాగాయి. అమ్మవారిని పలు రూపాల్లో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. నాగర్‌కర్నూల్ పట్టణంలోని హౌజింగ్‌బోర్డు, ఈశ్వర్‌కాలనీ, ఈదమ్మగూడి తదితర కాలనీలలో దుర్గామాత విగ్రహాల ముందు బతకమ్మలు నిర్వహించారు. సరస్వతి దేవి అవతారంలో అలంకరించారు. అచ్చంపేట వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవాలయంలో అమ్మవారిని రూ.11,11,111తో మహాలక్ష్మీ దేవిగా అలంకరించారు. స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ, సీబీఎం ట్రస్ట్ ఛైర్‌పర్సన్ అనురాధ పలు మండపాల్లో ప్రత్యేక పూజలు చేశారు. కొల్లాపూర్‌లోని కన్యకా పరమేశ్వరాలయంలో అమ్మవారికి పుష్పలంకరణ చేశారు. వరిదేల శమీవృక్షం వద్ద రూ.15 లక్షలతో ధనలక్ష్మీగా అలంకరించారు.
- న్యూస్‌టుడే బృందం




కోడేరు: బీసీ కాలనీలో హోమం



కొల్లాపూర్: ధనలక్ష్మీదేవిగా...



తాడూరులో..



బిజినేపల్లి : వట్టెంలో..



నాగర్‌కర్నూల్ : ఈశ్వర్‌కాలనీలో..



అచ్చంపేట: శ్రీరాంనగర్ కాలనీలో...

కేఎల్ఐ కాల్వ వెంట రహదారులు

వెల్దండ గ్రామీణం, న్యూస్‌టుడే : కల్వకుర్తి ఎత్తిపోతల పథకం డి-82 కాల్వల వెంట రైతులు, వాహనాల రాకపోకలకు రహదారి సౌకర్యం కల్పించనున్నట్లు నీటి పారుదల శాఖ ఎస్ఈ సత్యనారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం ఆ శాఖ ఇన్‌ఛార్జి ఈఈ పార్థసారది, డిప్యూటీ ఈఈలు దేవన్న, సమ్మయ్యలతో కలిసి వెల్దండ మండల పరిధిలో గల 20 కిలో మీటర్ల కేఎల్ఐ కాల్వను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలం నాగిళ్ల వరకు సాగు నీరందించేందుకు ముందుస్తు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. రైతులు రాకపోకల కోసం రాతి బండలతో కాల్వల మధ్యలో రహదారులు ఏర్పాటు చేసుకోవడంతో నీరు ముందుకు వెళ్లని పరిస్థితి నెలకొందన్నారు. అలాంటి వాటిని తొలగించి, అవసరమున్న చోట సిమెంట్ పైపులతో సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జేఈ రాఘవేందర్, గుత్తేదారుడు వెంకట్రావు, సప్తగిరి తదితరులు పాల్గొన్నారు.



కాల్వను పరిశీలిస్తున్న ఎస్ఈ సత్యనారాయణరెడ్డి

అధిక విద్యుత్తు బిల్లులతో ఆందోళన

కందనూలు, న్యూస్‌టుడే : నాగర్‌కర్నూలులోని రాంనగర్ కాలనీలో 40 ఇళ్లకు జులై, ఆగస్టు నెలలో గృహలక్ష్మి పథకం కింద జీరో బిల్లులు వచ్చాయి. అక్టోబర్ నెలలో సెప్టెంబర్ నెలకు సంబంధించి బిల్లులు మంగళవారం నమోదు చేయగా ఒక్కో ఇంటికి 130 నుంచి 150 యూనిట్లు వినియోగించినట్లు తేలింది. రూ. 1500 నుంచి రూ. 1900 వరకు బిల్లులు రావడంతో గృహలక్ష్మి పథకానికి దూరం అవుతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిబ్బంది తప్పిదంతోనే అధిక బిల్లులు వచ్చినట్లు ఆరోపిస్తున్నారు. ఏఈ గోపాల్‌రెడ్డి స్పందిస్తూ సాంకేతిక కారణాల వలన అధిక బిల్లులు వచ్చినట్లు తెలిపారు. దీనిపై విచారణ చేస్తున్నామన్నారు.

ఆలయానికి కుర్చీల వితరణ

ఉప్పునుంతల, న్యూస్‌టుడే : మండల కేంద్రంలోని కేదారేశ్వర, చెన్నకేశవ ఆలయానికి స్థానిక ఆర్యవైశ్య సంఘం నాయకులు కుర్చీలను వితరణ చేశారు. రూ.40వేల వ్యయంతో 100 కుర్చీలను ఆలయ కమిటీకి మంగళవారం అందజేశారు. ఆలయ కమిటీ ఛైర్మన్ కట్టా నారాయణరెడ్డి, సంఘం నాయకులు పి.కుమారస్వామి, డి.కుమారస్వామి, మనోహర్, రవీందర్, కరుణాకర్, బాల్‌చంద్రయ్య, కిషన్, రాఘవేందర్, బి.శ్రీనివాసులు, సాయిరాం పాల్గొన్నారు.



కుర్చీలను అందజేస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

యుద్ధం ఆపే వరకు ఆందోళన

కల్వకుర్తి, న్యూస్‌టుడే : పాలస్తీనాపై ఇజ్రాయెల్ యుద్ధం ఆపే వరకు ఆందోళనలు చేపడతామని సీపీఎం నాయకులు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో నిరసన చేపట్టారు. అమెరికాకు భారత ప్రభుత్వం తలొగ్గి ఇజ్రాయెల్‌కు మద్దతు తెలపటాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు, నాయకులు ఎపీమల్లయ్య, ఆంజనేయులు, బాల్‌రెడ్డి, సి.ఆంజనేయులు, పరశురాములు, బాలస్వామి, యాదయ్య, కురుమయ్య పాల్గొన్నారు.



కల్వకుర్తి : నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

కూరగాయల ధరలు కిలో... రూ.లలో



కందనూలు, న్యూస్‌టుడే : టమాటా 80, వంకాయ 45, బెండ 45, మిరప 50, కాకర 64, బీర 64, క్యాలిఫ్లవర్ 74, క్యాబేజీ 44, క్యారెట్ 64, దొండ 50, ఆలుగడ్డ 45, గోకర 64, దోస 44, ఆనంకాయ 18, చిక్కుడు 70, మునగకాయ 74, బీట్‌రూట్ 58, ఖీర, 44, బీన్స్ 90

కోళ్ల పెంపకంతో లాభాలు

తెలకపల్లి, న్యూస్‌టుడే : మహిళలు ఇళ్ల వద్ద రాజశ్రీ రకం కోళ్ల పెంపకం చేపట్టి ఆదాయం పొందాలని స్వయం సహాయక మహిళా సంఘాలకు అవగాహన బీపీఎం అరుణాదేవి సూచించారు. మండల కేంద్రంలోని స్త్రీ శక్తి భవనంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. బీపీఎం సుధాకర్, ఏపీఎం నిరంజన్, సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

అరుణాచలం దర్శనానికి ప్రత్యేక బస్సు

నాగర్‌కర్నూల్, న్యూస్‌టుడే : అరుణాచలం గిరి ప్రదర్శనానికి నాగర్‌కర్నూల్ డిపో నుంచి సూపర్ లగ్జరీ బస్సును నడుపుతున్నట్లు డీఎం యాదయ్య తెలిపారు. ఈనెల 15న రాత్రి 9 గంటలకు నాగర్‌కర్నూల్ బస్టాండ్ నుంచి బయలుదేరి కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ దర్శనం తర్వాత అరుణాచలం చేరుకుంటుందని చెప్పారు. ఈనెల 17న సాయంత్రం అరుణాచలం నుంచి బయలుదేరి 18న వస్తుందన్నారు. రిజర్వేషన్ కోసం 94904 11590, 73828 27638ను సంప్రదించాలన్నారు. పెద్దవారికి టిక్కెట్టు ధర రూ.3,600, పిల్లలకు రూ.2,400 ఉంటుందన్నారు.

బస్సు నడపాలంటూ వినతి

తాడూరు, న్యూస్‌టుడే : భల్లాన్‌పల్లి మీదుగా జడ్చర్లకు ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలంటూ మంగళవారం గ్రామస్థులు నాగర్‌కర్నూల్ ఆర్టీసీ డిపో మేనేజర్ యాదయ్యకు వినతిపత్రం అందజేశారు. కరోనా సమయం నుంచి బస్సు సేవలు నిలిచిపోయాయన్నారు. జైపాల్‌రెడ్డి, యాదయ్య, తిరుపతయ్య పాల్గొన్నారు.

బడ్జెట్ రూపకల్పనపై సదస్సు

పెద్దకొత్తపల్లి, న్యూస్‌టుడే : జాతీయ ఉపాధి హామీ పథకం 2025-26కు సంబంధించి బడ్జెట్ రూపకల్పనపై ఎంపీడీవో సమావేశ మందిరంలో మంగళవారం సదస్సు నిర్వహించారు. పెద్దకొత్తపల్లి, కోడేరు, పెంట్లవెల్లి మండలాలకు చెందిన సిబ్బందికి శిక్షణ ఇచ్చినట్లు ఎంపీడీవో నాగేందర్ తెలిపారు.

వెల్దండ, న్యూస్‌టుడే: వెల్దండ ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందికి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టే పనుల ప్రణాళికలపై మంగళవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో సత్యపాల్‌రెడ్డి, రిసోర్సు పర్సన్‌లు తాహెర్, నరసింహ, ఎంపీవో లక్ష్మణ్‌నాయక్ పాల్గొన్నారు.

కార్మికులకు భద్రత కల్పించాలి

తిమ్మాజిపేట, న్యూస్‌టుడే : తిమ్మాజిపేటలోని తెలంగాణ బేవరేజస్ కార్పొరేషన్ లిమిటెడ్ మద్యం గోదాంలో కార్మికులకు భద్రత కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్ డిమాండ్ చేశారు. మంగళవారం గోదాం వద్ద నిర్వహించిన కార్మికుల సమావేశంలో మాట్లాడారు. వెంకటయ్య, ఆంజనేయులు, కృష్ణ, మధు, బాలయ్య, రాజు, ఉదయ్ పాల్గొన్నారు.

నేడు ఆయిల్ పాం సాగుపై శిక్షణ

కోడేరు, న్యూస్‌టుడే : మండలంలోని జనుంపల్లిలోని రైతు వేదికలో ఆయిల్ పాం పెంపకంపై రైతులకు బుధవారం ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కొల్లాపూర్ డివిజన్ ఉద్యాన శాఖ అధికారి లక్ష్మణ్ మంగళవారం తెలిపారు. ఆయిల్ పాం సాగుతో పాటు కొత్తగా నాటుకునే రైతులకు సూచనలతో అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖ అధికారి, కేవీకే పాలెం ఉద్యాన శాస్త్రవేత్తలు హాజరు కానున్నట్లు తెలిపారు. ఆయిల్‌పాం సాగు చేసుకునే రైతులు పెద్ద ఎత్తున హాజరు కావాలని ఆయన కోరారు.

ఎల్‌వోసీ అందజేత

కోడేరు, న్యూస్‌టుడే : మండలంలోని తీగలపల్లికి చెందిన కల్ల మల్లేష్ కుడిచేతికి శస్త్రచికిత్స కోసం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చేరాడు. సీఎం సహాయ నిధి నుంచి రూ.1.25 లక్షల ఎల్‌వోసీని అందజేసినట్లు ఆ గ్రామ నాయకుడు భాస్కర్‌రెడ్డి మంగళవారం తెలిపారు.

పురాతన ఆలయాలను పరిరక్షించాలి

ఉప్పునుంతల, న్యూస్‌టుడే : కాంసానిపల్లిలో ఉమామహేశ్వర దేవస్థానం డైరెక్టర్ కట్టా శేఖర్‌రెడ్డిని గ్రామస్థులు మంగళవారం సన్మానించారు. చరిత్ర గల పురాతన ఆలయాలను పరిరక్షించాలని రేణయ్య, శ్రీనివాసులు, చెన్నకేశవులు, మల్లేష్ కోరారు. భాస్కర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మాలలపై చిన్నచూపు తగదు

తాడూరు, న్యూస్‌టుడే : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాలలపై చిన్నచూపు తగదని మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి చింత సత్తి అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఆ సంఘం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. నాగర్‌కర్నూల్‌లో ఈనెల 27న నిర్వహించనున్న మాలల బహిరంగ సభను విజయవంతం చేయాలన్నారు. మండల నూతన కమిటీ గౌరవాధ్యక్షుడిగా వెంకటయ్య, అధ్యక్షుడిగా ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా కురుమూర్తితో పాటు 10 మంది సభ్యులను ఎన్నుకున్నారు. రమేశ్, శ్రీనివాసులు, కోటేశ్ తదితరులు పాల్గొన్నారు.

కులవివక్షను తరిమికొట్టాలి

బిజినేపల్లి, న్యూస్‌టుడే : బిజినేపల్లి మండల కేంద్రంలో మంగళవారం కుల వివక్ష పోరాట సమితి(కేవీపీఎస్) జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్న ఆధ్వర్యంలో సంఘం ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జెండా ఎగురవేసి మాట్లాడారు. దళితులు నేటికీ కుల వివక్షను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హన్మంతు, శుభాకర్, శ్రీను, కుమార్, రాములు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మృతి.. కొల్లాపూర్ పట్టణం, న్యూస్‌టుడే : పురుగు మందు తాగి చికిత్స పొందుతూ మంగళవారం ఓ వ్యక్తి మృతిచెందారు. ఎస్సై హృషికేశ్ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని సింగోటం గ్రామానికి చెందిన వెంకటస్వామి(52) అప్పు చేసి ఇల్లు నిర్మించుకున్నారు. అది తీర్చలేక మనస్తాపం చెంది సోమవారం పురుగు మందు తాగారు. నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. భార్య బాలకిష్టమ్మ, కుమారుడు మల్లేష్ ఉన్నారు. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

గుర్తు తెలియని మహిళ శవం.. లింగాల, న్యూస్‌టుడే: లింగాల గ్రామపంచాయతీ కార్యాలయం సమీపంలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని మహిళ (50) మృతి చెందింది. గ్రామస్థులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారం రోజుల నుంచి ఆమె భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తోందని స్థానికులు పేర్కొన్నారు.

మహిళపై ఆసుపత్రి సిబ్బంది దాడి.. అచ్చంపేట న్యూటౌన్, న్యూస్‌టుడే : వైద్య పరీక్షలు, మందులకు డబ్బులు పూర్తిగా ఇవ్వలేదని ప్రయివేటు ఆస్పత్రి సిబ్బంది ఓ మహిళలపై దురుసుగా ప్రవర్తించారు. ఈ సంఘటన పట్టణంలో మంగళవారం చోటుచేసుకుంది. బాధిత మహిళ కథనం ప్రకారం.. బల్మూర్ మండలం కొండనాగులకు చెందిన లింగమ్మ.. కోడలు స్వాతితో కలిసి మూడు రోజులుగా పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి వస్తున్నారు. చికిత్సతో పాటు వైద్యుల సలహా మేరకు మంగళవారం రక్త పరీక్షలు చేయించుకోగా.. రూ.1500 బిల్లు అయింది. రూ.వెయ్యి చెల్లించి, రూ.500 తర్వాత ఇస్తానని చెప్పి వెళ్తుండగా ఇద్దరు ఆస్పత్రి సిబ్బంది అంబేడ్కర్ కూడలి సమీపంలో అడ్డుకున్నారు. ఈ క్రమంలో జరిగిన గొడవలో స్వాతి చేతికి స్వల్ప గాయాలయ్యాయి. అనంతరం బాధితులు ఆస్పత్రికి చేరుకుని రూ.500 కోసం దాడులు చేయడమేంటని ప్రశ్నించారు. వైద్యుడు, సిబ్బంది ఎవరికి ఫిర్యాదు చేసుకుంటావో చేసుకోమని దురుసుగా ప్రవర్తించారు. విషయంపై ఆస్పత్రి వైద్యురాలిని వివరణ కోరగా.. మందులను ఉద్దెరకు ఇస్తే దుకాణ సిబ్బంది వేతనంలో కోత పెడతామని నిర్వాహకులు హెచ్చరించగా మహిళలను నిలదీశారని చెప్పారు. ఈ క్రమంలో చోటుచేసుకున్న వాగ్వాదంలో మహిళనే సిబ్బందిపై దాడికి పాల్పడిందని ఈ మేరకు ఆమెపై ఫిర్యాదు చేశామని వైద్యురాలు చెప్పారు.

రెండు ఇళ్లలో చోరీ.. అచ్చంపేట న్యూటౌన్, న్యూస్‌టుడే : రెండు ఇళ్లలో చోరీ జరిగింది. ఎస్సై ఇందిర కథనం ప్రకారం.. పట్టణంలోని మారుతీనగర్ కాలనీకి చెందిన రామకృష్ణయ్య మంగళవారం ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి సొంత గ్రామం అమ్రాబాద్ మండలంలోని మాచారం వెళ్లారు. మధ్యాహ్నం ఇంటికి వచ్చి చూడగా తాళం పగులకొట్టి ఉంది. ఇంట్లో ఉన్న కొంత బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, రూ.4,500 నగదు చోరీకి గురయ్యాయి. వెంకటేశ్వర కాలనీకి చెందిన ముడావత్ రవి భార్యతో కలిసి మేస్త్రీ పనికి వెళ్లారు. సాయంత్రం వచ్చి చూడగా ఇంట్లో తులం బంగారం, రెండు జతల వెండి గొలుసులు, రూ.15 వేలు చోరీకి గురయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

సారా తయారీ.. ఒకరిపై కేసు నమోదు.. చారకొండ (వెల్దండ గ్రామీణం), న్యూస్‌టుడే : చారకొండ మండల కేంద్రంతో పాటు గోకారం, తుర్కపల్లి గ్రామాల్లో మంగళవారం ఎక్సైజ్, ఎన్‌ఫోర్సుమెంట్ అధికారుల ఆధ్వర్యంలో సారా తయారీ కేంద్రాలపై దాడులు నిర్వహించారు. 600 లీటర్ల బెల్లం పాకాన్ని పారబోసారు. 15 లీటర్ల సారా, 20 కిలోల బెల్లం పట్టుకుని ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. దాడుల్లో ఎన్‌ఫోర్సుమెంట్ సీఐ రాజ్యలక్ష్మి, ఎస్సై సృజన, సిబ్బంది రఘు, మాధవి, తిరుపతిరెడ్డి, అనుషా, నార్య, పరశురామ్ తదితరులు పాల్గొన్నారు.

30 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత.. చారకొండ (వెల్దండ గ్రామీణం), న్యూస్‌టుడే: చారకొండ మండలం సారబండతండాలో మంగళవారం 30 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నట్లు ఎస్సై వెంకట్‌రెడ్డి తెలిపారు. సారబండతండాకు చెందిన ఇస్లావత్ నవీన్ వివిధ గ్రామాల్లో తక్కువ ధరకు బియ్యం కొనుగోలు చేసి తన బొలెరో వాహనంలో తరలిస్తుండగా పట్టుకున్నామని చెప్పారు. అతడిపై కేసు నమోదు చేసి వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

యువకుడి కోసం కొనసాగుతున్న గాలింపు.. లింగాల, న్యూస్‌టుడే : నల్లమల అడవిలో అదృశ్యమైన వ్యక్తి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. మండలంలోని ఎర్రపెంటకు చెందిన నిమ్మల శంకర్, కృష్ణ గతనెల 28న అటవీ ఉత్పత్తుల కోసం అడవిలోకి వెళ్లి రాత్రి అక్కడే నిద్రించగా.. మురుసటి రోజు శంకర్ కనిపించలేదు. దీంతో భార్య పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. మంగళవారం ఎస్సై జగన్‌మోహన్, అటవీ సిబ్బంది బిక్కిట్‌పెంట, కర్కపెంట, మామిడిపెంట తదితర ప్రాంతాల్లో డ్రోన్ సహాయంతో వెదికారు. చీకటి పడటంతో వెనుదిరిగారు. అటవీ సెక్షన్ ఆఫీసర్ రాంబాబు, రవీందర్, ఆర్ఐ సీతారాం, చెంచులు పాల్గొన్నారు.



మ్యాప్ సహాయంతో సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న అటవీ, పోలీసు సిబ్బంది